సాక్షి పల్నాడు

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



ముత్యాలమ్మ గుడికి శంకుస్థాపన

మంగళగిరి: యర్రబాలెం జంగాల కాలనీ లో ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ హనుమంత రావు గురువారం శంకుస్థాపన చేశారు.



ఖడ్గమాలార్చనలో కరికాల వలవన్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు నిర్వహించే ఖడ్గమాలార్చన పూజలో దేవదాయశాఖ ప్రత్యేక పధాన కార్యదర్శి ఆర్.కరికాల వలవన్ గురువారం పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖ బాపట్ల జిల్లా అధికారికి జేడీగా పదోన్నతి



బాపట్లటౌన్: బాపట్ల జిల్లా పరిశ్రమల శాఖాధికారి ఎస్.మదన్‌మోహన్‌శెట్టికి జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్‌గా నియమించింది.

న్యూస్‌రీల్

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పాత గుంటూరు: ఈనెల 27న పౌర్ణమిని పురస్కరించుకొని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణ మహోత్సవాలకు ఆర్టీసీ గుంటూరు-2 డిపో నుంచి రెండు స్పెషల్ హైటెక్ బస్సులు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం తెలిపారు. ఈ బస్సులు ఈనెల 25న రాత్రి 9.15 గంటలకు గుంటూరులో బయలుదేరి, 26న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి బయలుదేరి పౌర్ణమిరోజు ఉదయం అరుణాచలం చేరుకుంటాయని తెలిపారు. అరుణాచలేశ్వరుని దర్శించుకొని 27న సాయంత్రం అరుణాచలంలో బయలుదేరి 28న ఉదయం 6.30 గంటలకు గుంటూరు చేరుతాయని అన్నారు. ఈ సర్వీస్‌లకు 96164 , 96089 నంబర్ల ద్వారా ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రానుపోను ఒక్కో టికెట్ ధర రూ. 2,420 మాత్రమేనని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమాచారం కోసం 99592 25421 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కాల్ చేయగానే 108 అంబులెన్స్ చేరుకోవాలి



పెదకాకాని: ప్రజలు, రోగుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే 108 వాహనం అందుబాటులోకి వెళ్లాలని రాష్ట్ర నోడల్ ఆఫీసర్ హనుమాన్ నాయక్ అన్నారు. 108, 104 వాహనాల తనిఖీలో భాగంగా అధికారులు గురువారం గుంటూరు జిల్లా పెదకాకాని చేరుకున్నారు. పెదకాకానిలో ఉన్న వాహనాలను తనిఖీ చేయడంతో పాటు ఆపరేషన్ పరికరాలు, మందుల నిల్వలను పరిశీలించారు. ప్రజల నుంచి సమాచారం అందగానే ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించడంతో పాటు ఆసుపత్రికి చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం నాగదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం


విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 524.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,034, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 12,054, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 839.80 అడుగుల వద్ద ఉంది.

యార్డుకు 19,110 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 19,110 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 19,085 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.13,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,725 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1,818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 76, బ్యాంక్ కెనాల్‌కు 279, తూర్పు కెనాల్‌కు 107, పశ్చిమ కెనాల్‌కు 25, నిజాంపట్నం కాలువకు 213, కొమ్మమూరు కాల్వకు 680 క్యూసెక్కులు విడుదల చేశారు.

బావావేశానికి బలి







ఘటనాస్థలంలో రక్తపు మడుగులో పడి ఉన్న అనంత నరేష్, సాంబయ్య, ఆదిలక్ష్మి మృతదేహాలు

కుటుంబ కలహాలే కబళించాయి

- బావమరిది, అత్త, మామ దారుణ హత్య
- భార్యాభర్తల మధ్య మనస్పర్థలే కారణం!
- చినికిచినికి గాలివానలా మారిన గొడవలు
- శోకసముద్రంలో బంధువులు
- ఉలిక్కిపడిన కోనంకి గ్రామం

పిడుగురాళ్ల: కుటుంబ కలహాలే ముగ్గురిని కబళించాయి. భార్యాభర్తల మధ్య మనస్పర్థల పంచాయితీ చినికిచినికి గాలివానలా పెద్ద గొడవలా మారి మూడు ప్రాణాలను బలితీసుకుంది. ఈ హృదయ విదారక ఘటన పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామంలో గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనంత నరేష్ (30)తో ఆరేళ్ల క్రితం ముప్పాళ్ల మండలం దొమ్మలగూడెం గ్రామానికి చెందిన మాధురికి పెళ్లయింది. వీరికి వేణుగోపాల్ అనే ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. నరేష్‌కు సుమారు 15 ఎకరాల భూమి ఉంది. ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ, ఉన్న పొలం పనులు చేస్తూ ఉండేవాడు. నరేష్‌కు పిసినారిగా పేరు. పిసినారితనం వల్ల తరచూ భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వస్తుండేవి. ఈ క్రమంలోనే మాధురికి బుధవారం ఉదయం కడుపునొప్పి రావడంతో పిడుగురాళ్ల పట్టణంలోని ఆస్పత్రిలో చూపించాలని భర్త నరేష్, మామ సాంబయ్య(56)ను కోరింది. దీనికి వారు నిరాకరించడంతోపాటు పొలం పనికి వెళ్లాలని ఆదేశించారు. దీంతో మాధురి తన అన్న దోమా శ్రీనివాసరావుకు ఫోన్‌చేసి విషయం చెప్పింది. దీంతో అతను తన తండ్రి సుబ్బారావుతో కలిసి బైక్‌పై కోనంకి వచ్చాడు. మాధురి తన తండ్రి, సోదరుడికి విషయం చెబుతుండగానే నరేష్ భార్యపై చేయిచేసుకున్నాడు. దీంతో గొడవ చినికి చినికి గాలివానలా మారింది. తమ ముందే తన చెల్లెలిని కొట్టడాన్ని భరించలేని శ్రీనివాసరావు ఆగ్రహంతో అక్కడే ఉన్న కత్తితో బావమరిది అనంత నరేష్‌ను పొడిచాడు. నిర్ఘాంతపోయిన నరేష్ తండ్రి సాంబయ్య(56) శ్రీనివాసరావుపైకి రావడంతో అతడినీ కత్తితో పొడిచాడు. తండ్రి, కొడుకులిద్దరూ రక్తపుమడుగులో పడి ఉండడాన్ని చూసిన నరేష్ తల్లి ఆదిలక్ష్మి(50) రోదిస్తూ దగ్గరకు రావడంతో ఆమెనూ శ్రీనివాసరావు విచక్షణారహితంగా కత్తితో పొడిచాడు. దీంతో ముగ్గురూ అక్కడికక్కడే మరణించారు. అర్ధరాత్రి కావడంతోపాటు వాన కురుస్తుండటంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. తెల్లవారుజామున విషయం బయటకు వచ్చింది. స్థానికుల సమాచారంతో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.



కోనంకి గ్రామంలో విచారణ చేస్తున్న గురజాల డీఎస్పీ పల్లపు రాజు, సీఐ పీవీ ఆంజనేయులు

ఘటనాస్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

ఘటనా స్థలాన్ని గురజాల డీఎస్పీ పల్లపు రాజు గురువారం పరిశీలించారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కుటుంబ కలహాలే హత్యలకు కారణమని స్పష్టం చేశారు. సోదరి పడుతున్న బాధలను విని భరించలేక అడుగుదామని శ్రీనివాసరావు, అతడి తండ్రి సుబ్బారావు కోనంకి వచ్చారని తెలిపారు. ఈ సమయంలో గొడవ చినికిచినికి గాలివానలా మారడంతో ఆగ్రహంతో శ్రీనివాసరావు బావమరిదితోపాటు అతని తల్లిదండ్రులను కత్తితోపొడిచి హత్య చేసి పరారైనట్టు వెల్లడించారు. మృతుడు అనంత సాంబయ్య అన్న ఆంజనేయులు కుమారుడు అనంత సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ వెల్లడించారు. ఇదిలా ఉంటే హత్యలు చేసిన నిందితుడు దోమా శ్రీనివాసరావు, అతడి తండ్రి సుబ్బారావు, సోదరి మాధురి ముప్పాళ్ల పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.



రైతులకు రుణాల చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు

కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సహకార సంఘాలు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- అమరావతిలో జీడీసీసీ బ్యాంకు కొత్త బ్రాంచి ప్రారంభం

అమరావతి: సహకార బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేసి కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా తయారు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. స్థానిక జీడీసీసీ బ్యాంకు కొత్త బ్రాంచ్‌ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో సహకార బ్యాంకులు రైతులకు నామమాత్రంగా ఉపయోగపడేవని, ఇప్పుడు జగనన్న పాలనలో రైతు బిడ్డల విదేశీ విద్యకూ సహకారం అందిస్తున్నాయన్నారు. నూతన బ్రాంచ్ ఏర్పాటు సందర్భంగా ఇంటింటికీ సహకారం అన్న కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికీ సహకార బ్యాంకు సేవలను వివరిస్తామన్నారు. గుంటూరు జిల్లా సహకార బ్యాంకు గత టీడీపీ హయాంలో రూ.2,540 కోట్ల లావాదేవీలు జరిపితే, ఇప్పుడు రూ.6,077 కోట్ల లావాదేవీలు జరిపే స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. అమరావతి బ్రాంచ్‌ని రూ.72 కోట్ల లావాదేవీలు జరిపే స్థాయి నుంచి రూ.253 కోట్ల లావాదేవీలు జరిపే స్థాయికి తీసుకువచ్చామన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఐదు కోట్ల రూపాయల దీర్ఘకాలిక రుణాల చెక్కును నరుకుళ్ళపాడు, మునగోడు, పెదమద్దూరు పీఏసీఎస్‌ల తరఫున జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు తదితర రైతులకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, రాష్ట్ర సహకార శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఆప్కాబ్ ఎండీ శ్రీనాథరెడ్డి, నాబార్డు డీడీఎం శరత్, గుంటూరు జీడీసీసీ బ్యాంక్ సీఈఓ కృష్ణవేణి ఆప్కాబ్ జీఎం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.1,100, గరిష్ఠ ధర రూ.1,800, మోడల్ ధర రూ.1500 వరకు పలికింది.



జై భవానీ.. జై జై భవానీ..

- దుర్గమ్మ సన్నిధిలో ఆరంభమైన మండల దీక్షలు
- ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు
- పగడాల మాలతో మూలవిరాట్ అలంకరణ
- అమ్మ సన్నిధిలో ఆఖండ దీపార్చన
- పౌర్ణమి వరకు మండల దీక్షల స్వీకరణ



భవానీ దీక్షలు చేపడుతున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జై భవానీ.. జైజై భవానీ నామస్మరణతో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధి మార్మోగింది. జగన్మాతా.. కరుణించమ్మా.. కాపాడు తల్లీ అంటూ భవానీలు పూజించారు. కార్తిక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం నుంచి అమ్మవారి మండల దీక్షలు ఆరంభమయ్యాయి. ప్రధాన ఆలయంలోని మూలవిరాట్‌కు అర్చకులు పూజలు నిర్వహించిన అనంతరం పగడాల మాలధారణ చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపుగా మహా మండపం ఆరో అంతస్తుకు తీసుకొచ్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తుల జయజయనాదాల మధ్య ఊరేగింపు వైభవంగా సాగింది. ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, కలశస్థాపన చేసి అమ్మవారి ఆవాహన వంటి వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈఓ కె.ఎస్.రామారావు, ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, అర్చకులు, వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవ మూర్తికి దీక్ష మాలలను అలంకరించి అఖండ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు లింగంభొట్ల బద్రీనాథ్, ఉప ప్రధాన అర్చకులు వై.నాగరాజు శాస్త్రి, ఆచార్య గురు భవానీలు, ఈవో చేతుల మీదుగా భక్తులు దీక్షలను స్వీకరించారు. కార్తిక పౌర్ణమి సోమవారం వరకు భక్తులు అమ్మవారి దీక్షలను స్వీకరించేందుకు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

దీక్షల స్వీకరణకు తరలివచ్చిన భవానీలు

అమ్మవారి దీక్షలను స్వీకరించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. పవిత్ర దుర్గా ఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు దీక్షావస్త్రాలను ధరించి మాలధారణకు కొండపైకి చేరుకున్నారు. తొలుత అమ్మవారి మూలవిరాట్‌కు మాలలను చూపిన అనంతరం గురు భవానీల చేతుల మీదుగా మెడలో ధరించారు.



మహా మండపం వద్దకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకొస్తున్న దృశ్యం

కల్యాణం.. క'మనీ'యం



కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు కల్యాణమస్తు, షాదీతోఫా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

- 539 మందికి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా లబ్ధి
- రూ.4.98 కోట్ల మేర ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

నరసరావుపేట: వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా నగదును అట్టహాసాలకు పోకుండా ప్రణాళికాబద్ధంగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకం ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు బటన్ నొక్కి నేరుగా సొమ్ము జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ వర్చువల్ విధానంలో వీక్షించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులతో కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ మాట్లాడారు. నగదును ఎలా వినియోగించుకుంటారో అడిగి తెలుసుకున్నారు. మహిళలు అందరూ డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా చేరాలని సూచించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కల్యాణమస్తు, షాదీతోఫా ద్వారా ప్రోత్సాహకంగా అందించే నగదును దుబారా చేయకుండా అవసరానికి వినియోగించుకోవాలని సూచించారు. వైఎస్సార్ ఆసరా ద్వారా డ్వాక్రా మహిళలకు తక్కువ వడ్డీతో ఇచ్చే రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలూ నాయక్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల్ నాయుడు, జిల్లా డెవలప్‌మెంట్ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇలా..

సామాజికవర్గం	లబ్ధిదారుల సంఖ్య	జమైన మొత్తం (రూపాయల్లో)
ఎస్సీ	249	2,49,00,000
ఎస్సీ(కులాంతర)	08	9,60,000
వికలాంగులు	03	4,50,000
ఎస్టీ	58	58,00,000
ఎస్టీ(కులాంతర)	06	7,20,000
బీసీ	09	4,50,000
బీసీ(కులాంతర)	148	1,11,00,000
మైనార్టీ	52	52,00,000
భవన నిర్మాణ కార్మికులు	06	2,40,000
మొత్తం	539	4,98,20,000

ఎల్ఎల్‌బీ కోర్సుల బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమవుతున్న ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుల బ్రోచర్‌ను గురువారం వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రెండు దశాబ్దాల తరువాత యూనివర్సిటీ కళాశాలలో ఎల్ఎల్‌బీ కోర్సులను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పేరుతో ప్రారంభించామన్నారు. ఈ ఏడాది బీఏ ఎల్ఎల్‌బీ హానర్స్, బీబీఏ ఎల్ఎల్‌బీ హానర్స్ కోర్సులకు అడ్మిషన్లు జరగనున్నాయన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతోపాటు ఉద్యోగ విరమణ చేసిన న్యాయ నిపుణులు, న్యాయమూర్తులు ఏఎన్‌యూ న్యాయకళాశాలలో తమ సేవలు అందించనున్నారని వివరించారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ విభాగాధిపతి ఎల్.జయశ్రీ, డాక్టర్ శ్రీగౌరీ, డాక్టర్ రమణ, డాక్టర్ ఎస్.సతీష్, డాక్టర్ కిషోర్, ఎస్.చంద్రశేఖర్, అభిలాష్, శశి కిరణ్ పాల్గొన్నారు.



ఎల్ఎల్‌బీ కోర్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

సంక్షేమ గళం



జగనన్న రుణం తీర్చుకోలేం



అట్టలు, కాగితాలు, సీసాలు, ప్లాస్టిక్ ఏరుకుని అవి అమ్మి జీవితాన్ని వెళ్లబుచ్చే పేదలం. రోజుకు రెండువందలు సంపాదించుకుని రేషన్ బియ్యంతో పిల్లలకు కడుపునిండా తిండి పెడితే చాలు అనుకుని తృప్తి పడ్డాం. పోరంబోకు స్థలంలో చిన్న గుడిసె వేసుకుని జీవించే మాకు సొంతిల్లు అనేది కలలో కూడా జరగని పని అనుకున్నాం. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఇళ్లస్థల పట్టా ఇచ్చి ఇల్లు కట్టిస్తున్నారు. ఇక నుంచి సొంతింట్లో హాయిగా జీవించనున్నాం. జగనన్న రుణం తీర్చుకోలేం.

– మేకల వెంకటేశ్వరమ్మ, అంకమ్మరావు, అమరావతి

ఉచిత విద్య అద్భుతం

నాపేరు గూడూరి విజయ్‌కుమార్, భార్య అనూష. మాది కొత్తసాలన ఎస్సీకాలనీ. మాకు ఇద్దరు సంతానం. కూలి పనులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. బాబు చిన్నవాడు. కుమార్తె అమూల్య స్థానిక ఎంపీపీఎస్(ఏఏ)లో నాలుగో తరగతి చదువుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ఉచిత విద్య అద్భుతం. మనబడి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అందంగా మారాయి. అమ్మఒడి పథకం మాకు వరంగా మారింది. కాన్వెంట్ విద్యార్థులకు దీటుగా నా కుమార్తె చదువుతోంది. క్యాలీగ్రఫీలో నిష్ణాతులైన పాఠశాల హెచ్ఎం షేక్ జున్ను సాహెబ్ చేతిరాత, వేదగణితంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇంత మంచి విద్య అందిస్తున్న జగనన్నకు థ్యాంక్స్.

– గూడూరి విజయ్‌కుమార్, కొత్తసాలన ఎస్సీకాలనీ



చక్కని చేతిరాత రాస్తున్న విజయ్‌కుమార్ కుమార్తె అమూల్య

ఫీజు రీయింబర్స్‌మెంట్ వరం



నా పేరు గాదె శ్రీరాం. ఊరు క్రోసూరు మండలం గాదెవారిపాలెం. ప్రస్తుతం గుంటూరులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ (మెకానిల్ ఇంజినీరింగ్ డిప్లమా) రెండో సంవత్సరం చదువుతున్నా. మా కాలేజి ఫీజు హాస్టల్‌తో కలిపి ఏడాదికి రూ.45 వేలు. జగనన్న ప్రభుత్వంలో విద్యాదీవెన, వసతి దీవెన అందుతున్నాయి. ఇప్పటివరకు రెండు విడతలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చింది. మాది వ్యవసాయ కుటుంబం మాకు ఈ విద్యాపథకాలు వరంగా మారాయి.

– గాదెశ్రీరాం, గాదెవారిపాలెం, క్రోసూరు మండలం

క్లుప్తంగా

వెల్‌కమ్ ఆర్చైస్ త్వరగా పూర్తిచేయండి

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో వెల్‌కమ్ ఆర్చైస్ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబందిత అధికారులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. అన్నీ ప్రాంతాలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయలు, రైతు భరోసా నిర్మాణాలకు కలసి బాగా పని చేశారని అన్నారు. వీటితో పాటు వెల్ కమ్ ఆర్చైస్ బాగా చేయాలని, అన్ని మండల పరిధిలోని అధికారులు వీటిని పూర్తిచేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు నిర్దేశించిన పనులను పూర్తిచేసి, జిల్లాను ముందంజలో ఉంచిన ఇంజినీర్లను అభినందించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ చిన్న సుబ్బారాయుడు, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు.

పది పరీక్ష ఫీజు గడువు పెంపు



నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి- 2024 పబ్లిక్ పరీక్షల ఫీజు గడువును ఈనెల 30వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 ఆపరాధ రుసుంతో డిసెంబర్ ఒకటి నుంచి 4వ తేదీ వరకు, రూ.200 ఆపరాధ రుసుంతో డిసెంబర్ 9వ తేదీ వరకు, రూ.500 తో డిసెంబర్ 14వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని వివరించారు.

ఆన్‌లైన్‌లో ఎన్ఎంఎంఎస్ హాల్‌టికెట్లు....

2023-24 విద్యాసంవత్సరాని గాను డిసెంబర్ 3వ తేదీన నిర్వహించనున్న ఎన్ఎంఎంఎస్ పరీక్ష హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ శామ్యూల్ తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. గత ఏడాది 8వ తరగతి చదివే విద్యార్థులు 3,404 మంది దరఖాస్తు చేసుకోగా, ఈ ఏడాది 3,004 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- ఇళ్ల పట్టాలు పంపిణీ

దాచేపల్లి: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలోని 15వ వార్డులో 55 ఏళ్లుగా నివాసం ఉంటున్న 50 పేద కుటుంబాలకు ఇంటి పట్టాలను గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలు నివాసం ఉంటున్న ఈ కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లిన వెంటనే పట్టాలు ఇప్పించారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు తమవంతు కృషి చేస్తామని పేదలు చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, మాజీ సర్పంచులు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్‌బాషా, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, సొసైటి అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, నాయకులు కొమెరబత్తిన ఆనంద్‌కుమార్, ఓర్సు దుర్గారావు పాల్గొన్నారు.



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గూగుల్ పే పేరుతో మోసగిస్తున్న వ్యక్తి అరెస్టు

- రూ.8.66 లక్షలు స్వాధీనం
- నిందితుడిపై 18 కేసులు
- విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: గూగుల్ పే పేరుతో ప్రజలను మోసగిస్తున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.8.66 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. రాజుపాలెం మండలం అంచులవారిపాలేనికి చెందిన వేపూరి శరత్‌బాబు చెడు అలవాటులకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనే దురాలోచనతో బెట్టింగులకు అలవాటు పడి గూగుల్ పే ద్వారా ప్రజలను మోసం చేస్తున్నట్లు చెప్పారు. ఫోన్, టీవీలలో యాడ్స్‌లలో వచ్చే ఆటలను చూసి, ఆన్‌లైన్ గేములకు అలవాటు పడినటర్ల వివరించారు. క్రికెట్, పేకాట ఆటలకు డబ్బులు బెట్టింగ్ పెట్టి ఆడితే బాగా డబ్బులు వస్తాయనే దురాశతో ఇలాంటి పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. షాపుల వద్దకు వెళ్లి అందులో వస్తువులను కొనుగోలు చేసి డబ్బులు మా ఇంట్లో వారు ఫోన్ పే చేస్తారని చెప్పి వివరాలు తస్కరించి వారి అకౌంట్‌లో డబ్బులు దోచేస్తున్నట్లు చెప్పారు. బుధవారం సాయంత్రం సమయంలో వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్డు జంక్షన్ వద్ద ఉండగా అందిన సమాచారం మేరకు సీఐ సాంబశివరావు సిబ్బందితో అతడిని అదుపులోనికి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి అతడి ఇంటి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

అనేక పోలీస్‌స్టేషన్లలో కేసులు

జిల్లాలోని నరసరావుపేట, గురజాల సబ్ డివిజన్లలో 13 షాపులు, బాపట్ల జిల్లాలో ఒక షాపు, గుంటూరు లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు షాపులు, ప్రకాశం జిల్లా మార్కాపురం, టంగుటూరులో ఫోన్ పే ద్వారా డబ్బులు దొంగిలించిన కేసులో శరత్‌బాబు నిందితుడన్నారు. ఈ విధంగా సుమారు 18 కేసులలో రూ.11,19,000లు దొంగిలించగా, పోలీస్ స్టేషన్లలో రిపోర్టు ఇచ్చిన వెంటనే బ్యాంకులలో రూ. 2,26,000 ఫ్రీజ్ చేయటం జరిగిందన్నారు. గతంలో ఇతని మీద కూచిపూడి, నంది గామ, గిద్దలూరు, కంచికచర్ల, కంభం పోలీస్‌స్టేషన్లలో ఒక్కొక్క కేసు నమోదై ఉన్నాయన్నారు.

సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే 1930కి కాల్ చేయండి

ఎవరూ పరిచయం లేని వ్యక్తులకు ఫోన్లు ఇవ్వవద్దని, ఫోన్ పే పాస్వర్డ్ ఎదుటివారికి కనపడే విధంగా టైప్ చేయొద్దని ఎస్పీ సూచించారు. ఒకవేళ ఎవరికైనా సరే వారికి సంబంధం లేకుండా వారి అకౌంటులో నుంచి డబ్బులు కట్ కావటం, ఏదైనా ఆన్‌లైన్ మోసం జరిగినా వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ డెస్క్ నంబర్ 1930 కి కాల్‌చేయాలని సూచించారు. కేసు ఛేదించిన క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఎస్. కె చంద్రశేఖర్, డీఎస్పీ కేవీ మహేష్, వినుకొండ టౌన్ సీఐ ఎస్.సాంబశివరావు, సీసీఎస్ సీఐ విజయకృష్ణ, సీసీఎస్ ఎస్ఐలు చరణ్, ప్రకాశరావు, ఏఎస్ఐ పూర్ణ, హెడ్ కానిస్టేబుల్ శేషు, కానిస్టేబుల్ తిరుపతిరావు, వినుకొండ టౌన్ హెడ్ కానిస్టేబుల్స్ బాలాజీ, అశోక్ బాబులను ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

రైతు శ్రేయస్సే జగనన్న లక్ష్యం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: రైతు శ్రేయస్సే జగనన్న లక్ష్యంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ జలకళ పథకం కింద రైతులకు విద్యుత్ మోటార్లు, సోలార్ పరికరాలు గురువారం సాయంత్రం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కోసం గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. 202 మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే 190 మంది రైతులకు బోర్లు మంజూరు అయినట్లు వివరించారు. రైతులకు పైసా ఖర్చు లేకుండా బోర్లు వేయించి, విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 43 బోర్లు వేయగా అన్నింటికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. సబ్‌మెరిబుల్ పైపులు దగ్గర నుంచి, త్రీకోర్ కాపర్‌వైర్, హెడీపీఈ పైపులు, ప్యానెల్ బోర్డులు, రీవైరబుల్ ఫీజు యూనిట్స్, అవుట్‌డోర్ బాక్సులు వంటి పరికరాలన్నింటిని ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. వీటన్నింటి ధర సుమారు రూ.13 లక్షలు ఉంటుందని తెలిపారు. ఇంకా రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు గ్రామ గ్రామాన రైతు భరోసా కేంద్రాలు, మార్కెట్ యార్డుల ద్వారా గిట్టుబాటు ధరకు పంటకొనుగోలు, రైతులకు ముందస్తు పెట్టుబడి నిధి వంటి సౌకర్యాలు ఎన్నో కల్పించామన్నారు. సాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కృష్ణానది ద్వారా ఎత్తిపోతల పథకాలు నిర్మించినట్లు వెల్లడించారు. క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా రైతులకు నష్టం జరక్కుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్ రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం, ఎన్ఆర్‌జీఎస్ ఏపీడీ వెంకట నారాయణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు కృష్ణారెడ్డి, గంగాధరరెడ్డి, అచ్చంపేట సర్పంచి కంబాల వీరబాబు, ఉప సర్పంచి జాని, పార్టీ టౌన్ కన్వీనర్ షేక్ సమరం పాల్గొన్నారు.



వైఎస్సార్ జలకళ పథకం ద్వారా రైతులకు విద్యుత్ మోటార్లు, సోలార్ పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పాఠశాలలపై సూచనలు, సలహాలకు గ్రామసభలు



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర అధికారి నిరంజన్

నరసరావుపేట: మండల పాఠశాలలకు అవసరమైన అన్ని అంశాలను గ్రామసభ నిర్వహించి అందరి సలహాలు, సూచనలు ప్రణాళికలో పొందుపర్చాలని సమగ్ర శిక్ష పాఠశాల, సముదాయ, మండల ప్రణాళికల తయారీ రాష్ట్ర అధికారి పి.నిరంజన్ సూచించారు. నరసరావుపేట, నకరికల్లు మండల విద్యాశాఖ కేంద్రాలలో విద్యాప్రణాళిక తయారీపై చర్చించి, నరసరావుపేటలోని తిలక్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, నకరికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వేణుగోపాలరావు, జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు ఏఎస్ఓ పద్మారావు, ఏపీఓ శంకరరాజు పాల్గొన్నారు.

ఆరంభమైన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్

వర్షం కారణంగా వర్సిటీ క్రీడాప్రాంగణానికి వేదిక మార్పు

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో గురువారం సాయంత్రం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ రాష్ట్రస్థాయి అండర్-14 అంతర్ జిల్లాల బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రారంభ సమయానికి వర్షం రావటంతో కేవలం బాలికల డిస్కస్‌త్రో, షాట్‌పుట్, బాలుర షాట్‌పుట్ పోటీలను మాత్రమే నిర్వహించారు. ఎడతెరిపిలేని వర్షం కారణంగా పోటీల వేదికను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణానికి మార్పు చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధుల అభ్యర్థనను వర్సిటీ వైస్‌చాన్సలర్ పి.రాజశేఖర్ అంగీకరించి పోటీలను నిర్వహించుకునేందుకు అనుమతించినట్టు ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చప్పల్లి కోటేశ్వరరావు తెలిపారు.

పోటీల విజేతల వివరాలు..

- అండర్- 14 బాలికల షాట్‌పుట్ పోటీలో ఎస్.చాందినీ(తూర్పుగోదావరి) 8.07 మీటర్లు విసిరి ప్రథమ స్థానం, బి.పుష్ప (వైఎస్సార్ కడప జిల్లా) 7.39 మీటర్లు, సుగాలి కోవెల(అనంతపురం) 7.14మీటర్లు.
- డిస్కస్‌త్రోలో ఎస్.చాందినీ(తూర్పుగోదావరి) 24.40 మీటర్లు విసిరి ప్రథమ స్థానం, బి.పుష్ప (వైఎస్సార్ కడప జిల్లా) 21.05 మీటర్లు, బి.వి.జ్యోతి (ప్రకాశంజిల్లా) 19.65 మీటర్లు.
- అండర్-14 బాలుర షాట్‌పుట్ పోటీలో బి.అశ్విన్(కృష్ణాజిల్లా) 11.33 మీటర్లు, ఆర్.వెంకటహర్షవర్ధన్(గుంటూరు) 10.93 మీటర్లు, కె.సురేష్‌పాడల్(విశాఖ) 10.80 మీటర్లు.

ఏపీలో గ్రామసమాఖ్యలు, డ్వాక్రాగ్రూప్‌ల పనితీరు భేష్

- గుజరాత్, హరియణా ఐఏఎస్ అధికారుల బృందం వెల్లడి
- తాడికొండ మండలంలో పర్యటన

తాడికొండ: ఏపీలో గ్రామ సమాఖ్యలు, డ్వాక్రా గ్రూపుల పనితీరు బాగుందని గుజరాత్, హరియాణాకు చెందిన ఐఏఎస్ అధికారుల బృందం తెలిపింది. ఏపీలో జరుగుతున్న డ్వాక్రా సంఘాలను పరిశీలించేందుకు విచ్చేసిన బృందం తాడికొండ మండలం పాములపాడు, పొన్నెకల్లు గ్రామాల్లోని పలు డ్వాక్రా సంఘాలు, గ్రామ సమాఖ్యలను సందర్శించారు.

సంఘాలు పలు వ్యాపారాలు నిర్వహించి విజయవంతంగా ఎలా నడుపుతున్నారు అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమాఖ్యలు, డ్వాక్రా సంఘాలకు బ్యాంకు ఇస్తున్న రేట్ ఆఫ్ ఇంట్రస్ట్ ఎంత వీటి ద్వారా రుణం తీసుకొని ఏఏ వ్యాపారాలు నిర్వహించి ఆర్థికంగా నెలకు ఎంత ఆదాయం సంపాదిస్తున్నారు అనే విషయాలను తెలుసుకొని హర్షం వ్యక్తం చేశారు. వీరు పరిశీలించిన గ్రామాల్లోని పలు డ్వాక్రా మహిళలు, సమాఖ్యల పనితీరు నచ్చడంతో పాములపాడు గ్రామ సమాఖ్యకు రూ.5 వేలు, జోసఫ్ డ్వాక్రా మహిళా గ్రూపుకు రూ.3 వేలు పారితోషికం అందజేశారు. పర్యటనలో గుజరాత్ నవాసరి జిల్లా డెవపల్‌మెంట్ అధికారిణి పుష్పలత(ఐఏఎస్), నవాసరి జిల్లా మేనేజర్ వద్ల మయూరి, రాజ్‌కోట్ జిల్లా మేనేజర్ వీరేంద్ర బాసల్య, జనరల్ మేనేజర్ శ్రీ ఓం దేవి సిన్హ చుడాస్మా, పాములపాడు సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ, డీపీఎం జాగర్లమూడి రాంబాబు, సెర్ప్ డీజీఎం కేశవ్, ఏరియా కో ఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, ఏపీఎం సాంబశివరావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



పాములపాడులో డ్వాక్రా గ్రూపుల పనితీరును తెలుసుకుంటున్న ఐఏఎస్ అధికారుల బృందం

జాగ్రత్తగా క్లెయిమ్స్ పరిశీలన చేసి పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఓటరు సర్వేలో జాగ్రత్తగా క్లెయిమ్స్ పరిశీలన చేసి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎస్ఆర్ శంకరన్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్లెయిమ్స్, ఫిర్యాదుల ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వాటిని ఎలా పరిశీలించి డిస్పోజ్ చేస్తున్నారో ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి ఫాం-7 దరఖాస్తులను ఎలా డిస్పోజ్ చేస్తున్నారు, ఏమేమి చెక్ లిస్ట్ పెడుతున్నారు అనేది జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఏఈఆర్వోలు, ఈఆర్వోల వద్దనున్న క్లెయిమ్‌లను ప్రాపర్ ఫైలింగ్, డాక్యుమెంటేషన్, రసీదులతో డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వి నాయకం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

- శుభకార్యానికి వెళ్తుండగా ఘటన
- భర్తకు గాయాలు

చిలకలూరిపేట: శుభకార్యానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చిలకలూరిపేట పండరీపురం ఐదో లైనుకు చెందిన చేగు రాంప్రసాద్, మమత(35) దంపతులు. మార్టూరులో బంధువుల ఇంట్లో జరిగే ఓ శుభకార్యానికి రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పట్టణంలోని ఓగేరు వాగు వంతెన దాటాకా గొర్రెల మండి వద్ద ఉన్న హైవేపై ఉన్న కటింగ్ వద్దకు చేరుకోగానే అదేమార్గంలో వస్తున్న లారీ వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. మమతను లారీ కొద్ది దూరం ఈడ్చుకు వెళ్లింది. తీవ్రగాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా భర్త రాంప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్నా 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు.

రాజుపాలెంలో అత్యధిక వర్షపాతం నమోదు

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో రాజుపాలెం మండలంలో అత్యధిక వర్షం 47.8 మిల్లీమీటర్ల వర్షం నమోదు అయింది. జిల్లా మొత్తంపై బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 296.6 మి.మీ. వర్షం కురిసింది. జిల్లాలో 28 మండలాలు ఉండగా వాటిలో వెల్దుర్తి, రెంటచింతల మినహా మిగతా 26మండలాల్లో వర్షం పడిందని వాతావరణ అధికారులు తెలిపారు. చాలా మండలాల్లో గురువారం తెల్లవారుజాము భారీ వర్షం నమోదైంది. మాచర్ల, వినుకొండ, యడ్లపాడుల్లో 2.2 మి.మీ, దుర్గి, క్రోసూరులలో 3.0, గురజాల, దాచేపల్లిల్లో 3.4, కారంపూడిలో 32.2, పిడుగురాళ్లలో 31.4, మాచవరం 5.8, బెల్లంకొండ 5.4, అచ్చంపేట 2.8, అమరావతిలో 0.8, పెదకూరపాడులో 9.8, సత్తెనపల్లిలో 29.4, నకరికల్లులో 3.8, బొల్లాపల్లిలో 1.2, నూజెండ్లలో 11.8, శావల్యాపురంలో 2.4, ఈపూరులో 6.4, రొంపిచర్లలో 25.2, నరసరావుపేటలో 42.8, ముప్పాళ్లలో 24.6, నాదెండ్లలో 16.2, చిలకలూరిపేటలో 18.6 వర్షం కురిసింది.

బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



శిబిరానికి వచ్చిన విద్యార్థులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ



శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న అంబటి మురళీకృష్ణ

- వెంకటకృష్ణాపురంలో అనూహ్య స్పందన
- కంటి పరీక్షలకు భారీగా తరలివచ్చిన గ్రామస్తులు
- ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వెల్లడి

పెదకాకాని: మండలంలోని వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్లవారిపాలెం గ్రామాల్లో గురువారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్రజ్యోతి ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని స్థానిక పెద్దలతో కలసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల కలలను, తన ఆశయాలుగా స్వీకరించి, రాష్ట్ర చరిత్రలోనే ఎన్నికల మేనిఫెస్టోను నూటికి నూరు శాతం అమలు చేయడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా దక్షతకు నిదర్శనమని తెలిపారు. ముఖ్యమంత్రి సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఏడాది పొడవునా సంక్షేమ కార్యక్రమాల పరంపర కొనసాగిస్తూ బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంగా ప్రకటించినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలోనే గత 11 నెలల కాలంలో 11,615 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు చేయించి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు అందజేశామని పేర్కొన్నారు. పరీక్షలు జరిపిన ఏడు రోజుల్లో అక్కడే కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం నేత్రజ్యోతి ప్రత్యేకతగా పేర్కొన్నారు. ముందుగానే వెంకటకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లో బజరంగ్ సేవా విభాగం బృందం పర్యటించి, ఇంటింటికీ ప్రచారం చేసినట్లు చెప్పారు. శిబిరానికి వచ్చిన 673 మందికి పరీక్షలు చేయించినట్లు వివరించారు. గుంటూరు ట్రికాన్ క్లినిక్ సహకారంతో 106 మందికి ఫిజియోథెరఫీ సేవలు అందించామని తెలిపారు. ప్రధానంగా తమ వైద్య శిబిరానికి వెంకటకృష్ణాపురంలో అనూహ్య స్పందన లభించడం విశేషమని అంబటి మురళీకృష్ణ చెప్పారు. స్థానిక స్కూల్ విద్యార్థులకు ప్రత్యేక సమయాన్ని కేటాయించి కంటి పరీక్షలు చేయించామని, వృద్ధులు, వికలాంగుల రాకపోకల కోసం ప్రత్యేక వాహనాల్ని ఏర్పాటు చేశామని తెలిపారు. శిబిరానికి వచ్చిన విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశామని ఆయన చెప్పారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని శబరిమల భక్తుల కోసం డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ గురువారం వెల్లడించారు. రైలు నంబర్ 07143 సికింద్రాబాద్-కొల్లాం రైలు డిసెంబర్ 15, 29వ తేదీలలో నడుస్తుందని తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 2.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 07.30 గంటలకు కొల్లాం స్టేషన్‌కు చేరుతుందన్నారు. ఇదే రైలు తిరిగి(07144) సికింద్రాబాద్‌కు డిసెంబరు 16, 30వ తేదీలలో నడుస్తుందని వివరించారు. ఈ రైలు కొల్లాం నుంచి రాత్రి 11 గంటలకు బయలు దేరి మరుసటి తెల్లవారుజామున 4.30 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు చర్లపల్లి, మిరియాలగూడ, విష్ణుపురం, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్‌పడి, జొలార్‌పట్టి, ఇరోడ్, త్రిపూర్, పలకడ్, త్రిసూర్ ఎర్నాకులం టౌన్, కొట్టాయం మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. 07147 హైదరాబాద్-కొట్టాయం రైలు డిసెంబర్ 02,09వ తేదీలలో సాయంత్రం 6 గంటలకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 10.05 గంటలకు కొట్టాయం స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 07148 కొట్టాయం-హైదరాబాద్ రైలు డిసెంబర్ 04,11వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. ఈ రైలు రాత్రి .12.30 గంటలకు కొట్టాయం స్టేషన్ నుంచి బయలు దేరి మరుసటి రోజు ఉదయం 04.15 గంటలకు హైదరాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.